సాక్షి
కాకినాడ


ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



క్రానిక్ అల్సర్ల చికిత్సకు ప్రత్యేక ఓపీ


కాకినాడ క్రైం: క్రానిక్ అల్సర్ల చికిత్సకు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓపీ విభాగాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీ ఆర్ విఠల్ శనివారం ప్రారంభించారు.

వెండి చీర సమర్పణ



మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పాళ్లమ్మ తల్లికి యెరుబండి నాగేశ్వరరావు, సంతోషిమహాలక్ష్మి దంపతులు శనివారం రూ.1.42 లక్షల వెండి చీర సమర్పించారు.

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.85 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

టెట్‌కు 5 ఆన్‌లైన్ కేంద్రాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): **టెట్–2024** పరీక్షకు జిల్లాలో 5 ఆన్‌లైన్ కేంద్రాలు **ఏర్పాటు** చేశామని డీఈఓ పిల్లి రమేష్ శనివారం **తెలి**పారు. ఈ పరీక్షకు 5,880 మంది **అభ్యర్థులు** హాజరవుతున్నారని, ఈ నెల 27 నుంచి **మార్చి** 6 వరకూ ఉదయం, మధ్యాహ్నం **వీటిని నిర్వ**హిస్తున్నామని వివరించారు. అమృతాపురం అయాన్ ఇన్‌స్టిట్యూట్, ప్రగతి **ఇంజినీరింగ్** కళాశాలల్లో ఒక్కొక్కటి, సూరంపాలెం **ఆది**త్యలో 3 చొప్పున పరీక్ష కేంద్రాలు **ఏర్పాటు** చేశామని వివరించారు. దివ్యాంగులకు సహాయకులను నియమించామని, పరీక్ష కేంద్రానికి తాజా ఫొటోతో పాటు గుర్తింపు కార్డుతో హాజరు కావాలని సూచించారు.

నూతన రథంపై నేడు సత్యదేవుని ఊరేగింపు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో రూ.34 లక్షలతో నిర్మించిన నూతన రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఆదివారం ఊరేగించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ రథంపై స్వామి, అమ్మవార్లను గత గురువారం ఊరేగించిన విషయం విదితమే. ఈ రథంపై ఏడాదికి నాలుగు సార్లు మాత్రమే ఊరేగిస్తున్నారని, ప్రతి శనివారం ఊరేగించాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై గత శుక్రవారం 'నూతన రథంలో సత్యదేవుని విహారం' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ శనివారం పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున ఆదివారం ఈ రథయాత్ర నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇదే విషయాన్ని వచ్చే నెల 5న జరిగే ట్రస్ట్‌బోర్డు సమావేశంలో చర్చించి ప్రతి వారం ఊరేగించేలా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్యే రాజప్ప ర్యాలీలో అపశ్రుతి



డివైడర్ పైకి ఎక్కేసిన రాజప్ప కారు

పెద్దాపురం: స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం నిర్వహించిన ర్యాలీలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఆయనకు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ఆయనకు మూడోసారీ టీడీపీ టికెట్టు ఖరారైంది. ఈ నేపథ్యంలో మండలంలోని జె.తిమ్మాపురం నుంచి సామర్లకోట మండలం అచ్చంపేట వరకూ కార్యకర్తలు ఆనందోత్సవ ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక దర్గా సెంటర్ సమీపానికి రాగానే రాజప్ప కారు అదుపు తప్పి, డివైడర్ పైకి ఎక్కేసింది. అయితే, ఆయనకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో తెలుగు తమ్ముళ్లు ఊపిరి పీల్చుకున్నారు. పెద్దాపురం ఎమ్మెల్యేగా రెండుసార్లు తప్ప మూడోసారి గెలవరనే సెంటిమెంటు ఉంది. టికెట్టు వచ్చిన ఆనందంలో చేపట్టిన ర్యాలీలోనే ఇలా జరగడాన్ని కార్యకర్తలు అపశకునంగా భావిస్తూ, ఆదిలోనే హంసపాదు ఎదురైందనే భావన వచ్చేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

కార్మికుల సేవకు రెడీ



ప్రారంభానికి సిద్ధమైన ఈఎస్‌ఐ ఆసుపత్రి

- రూ.114 కోట్లతో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం
- డిస్పెన్సరీ నుంచి 100 పడకల స్థాయికి అభివృద్ధి
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని
- 65 వేల కార్మిక కుటుంబాలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు

కాకినాడ: స్థానిక సాంబమూర్తి నగర్‌లో ఒకప్పుడు ఉన్న చిన్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీ.. నేడు సుమారు 7.26 ఎకరాల విస్తీర్ణంలో.. ఏకంగా 100 పడకల ఆసుపత్రిగా రూపుదిద్దుకుంది. రూ.114 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన ఈఎస్‌ఐ ఆసుపత్రిని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం మధ్యాహ్నం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సంబంధిత ఏర్పాట్లను కాకినాడ ఈఎస్‌ఐ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, కేంద్ర ప్రజా పనుల శాఖ డీఈ దడాల లక్ష్మయ్య పర్యవేక్షిస్తున్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు భరోసానిచ్చే ఈ ఈఎస్‌ఐ ఆసుపత్రి అత్యాధునిక వైద్య సదుపాయాలతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది.

ప్రజాప్రతినిధుల కృషితో..

వాస్తవానికి గతంలో ఈ ఈఎస్‌ఐ ఆసుపత్రి రాజమహేంద్రవరం తరలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, దీనిని ఇక్కడే ఉంచేలా కాకినాడ ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రత్యేకంగా కృషి చేశారు. అనేక సాంకేతిక పరమైన ఇబ్బందులను అధిగమించారు. ఇక్కడ ఈఎస్‌ఐ ఆసుపత్రి ఆవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి వివరించి, మంజూరు చేయించారు. ఆరంభంలో ఆసుపత్రి నిర్మాణానికి కేంద్ర మంత్రి గంగ్వార్ చొరవతో రూ.100 కోట్లు మంజూరయ్యాయి. ఆ తరువాత కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన పరికరాలు, ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటుకు మరో రూ.14 కోట్లు మంజూరు చేశారు. దీని నిర్మాణానికి 2020 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. 2021 మార్చి 17న నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు 1.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసుపత్రిని నిర్మించారు. మరో 45 వేల చదరపు అడుగుల్లో వైద్యులు, సిబ్బంది క్వార్టర్లు కూడా నిర్మించారు. ఆసుపత్రిలో రెగ్యులర్, ప్రైవేటు సిబ్బంది కలిపి 300 మందికి పైగా సేవలందించనున్నారు. ఈఎస్‌ఐలో నమోదైన దాదాపు 65 వేల కార్మిక కుటుంబాలకు చెందిన సుమారు 2 లక్షల మందికి ఈఎస్‌ఐ ఆసుపత్రితో ప్రయోజనం కలగనుంది. ఒకప్పుడు కాకినాడ జిల్లా వారు ఈఎస్‌ఐ వైద్య సేవలు పొందాలంటే రాజమహేంద్రవరం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే ఆసుపత్రి సిద్ధం కావడంతో ఈ ప్రాంతంలో పని చేసే కార్మికులకు వ్యయప్రయాసలు తప్పనున్నాయి. మరోవైపు రాజమహేంద్రవరంలో కూడా ఆసుపత్రి నిర్మాణంలో ఉన్నందున ఆ ప్రాంతానికి చెందిన కార్మికులకు కూడా ఇక్కడే వైద్య సేవలు అందించనున్నట్టు ఈఎస్‌ఐ వర్గాలు చెబుతున్నాయి.



ఆసుపత్రిలో అత్యాధునిక వసతులతో సిద్ధమైన ఆపరేషన్ థియేటర్


కాకినాడకు గర్వకారణం



ఈఎస్‌ఐ ఆసుపత్రి వినియోగంలోకి రావడం ఎంతో సంతోషాన్నిస్తోంది. కాకినాడ లోకసభ నియోజకవర్గ పరిధిలోని దాదాపు 2 లక్షల మందికి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. శంకుస్థాపన తరువాత కరోనా వంటి అనేక అవరోధాలు ఎదురైనప్పటికీ వీటన్నింటినీ అధిగమించి మరీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేశాం.

– వంగా గీత, ఎంపీ, కాకినాడ

ఎంపీ చొరవతో..



ఎంపీ వంగా గీత పట్టుదలతో కృషి చేసినందువల్లనే కాకినాడకు ఈఎస్‌ఐ ఆసుపత్రి మంజూరై, వినియోగంలోకి వస్తోంది. దీనివలన వేలాది కార్మిక కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది. ప్రధాని మోదీ, సీఎం జగన్, ఎంపీ గీతలకు ధన్యవాదాలు.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ సిటీ

బ్యాంక్ ఆఫ్ బురిడీ!



గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళలు

- పిఠాపురం బ్యాంక్ ఆఫ్ బరోడాలో బినామీ రుణ దందా
- రూ.2 కోట్లకు పైగా మాయాజాలం
- పోలీసులను ఆశ్రయించిన డ్వాక్రా మహిళలు

పిఠాపురం: ఒక్క రూపాయి రుణం ఇవ్వాలంటేనే ఎన్నో నిబంధనలు. కానీ ఏ నిబంధనలూ పాటించకుండానే ఏకంగా రూ.కోట్లలో రుణాలు ఇచ్చేశారు పిఠాపురం బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు. తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించాలంటూ రుణగ్రహీతలైన డ్వాక్రా సంఘాల మహిళలకు నోటీసులు ఇవ్వడంతో ఈ అక్రమ రుణాల దందా వెలుగులోకి వచ్చింది. దీనిపై బాధిత మహిళలు పిఠాపురం, గొల్లప్రోలు పోలీసులకు, కాకినాడ ఎంపీ వంగా గీతకు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ..

నమ్మించి.. వంచించి..

సాధారణంగా మహిళా సంఘాన్ని వెలుగు యానిమేటర్లు ఏర్పాటు చేసి, రిజిస్ట్రేషన్ చేయించి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పొదుపు ప్రారంభించిన ఆరు నెలల తరువాత ఆ సంఘానికి కేవలం రూ.50 వేల వరకూ మాత్రమే బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తారు. దానిని ఆ సంఘం నిర్ణీత సమయంలో తిరిగి చెల్లించి, పొదుపు సక్రమంగా కడుతూంటే వారికిచ్చే రుణాన్ని దఫదఫాలుగా పెంచుతూంటారు. కానీ, కాకినాడకు చెందిన చిన్ని అనే మహిళ పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పలువురు మహిళలను కలిసి, తాను వెలుగు యానిమేటర్‌నని నమ్మబలికింది. వెలుగు అధికారులతో సంబంధం లేకుండానే, ఆన్‌లైన్ చేయకుండానే ఒక్కో సంఘానికి పది మంది చొప్పున సుమారు 40 సంఘాలు ఏర్పాటు చేసింది. చిన్నికి పిఠాపురం మండలం బి.కొత్తూరుకు చెందిన మరో మహిళ సహకరించిందని చెబుతున్నారు. రుణాలు ఇప్పిస్తామంటే ఆశపడిన అమాయక మహిళల ఆధార్ కార్డులు, ఫొటోలు తీసుకోవడమే కాకుండా, ఎక్కడ పడితే అక్కడ సంతకాలు కూడా చేయించుకుంది. అనంతరం ఒక్కో సంఘానికి పిఠాపురం బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ రుణాలు మంజూరు చేసింది. ఇలా 40 సంఘాలకు రూ.2 కోట్లు పైగా రుణాలు మంజూరు చేశారు. అయితే, వాస్తవానికి తమకు అంత మొత్తంలో రుణాలు ఇవ్వలేదని బాధిత మహిళలు అంటున్నారు. తమకు కేవలం రూ.50 వేలు మాత్రమే ఇచ్చి, కొన్ని నెలలుగా తమతో డబ్బులు కట్టించుకుంటూ, వాటిని బ్యాంకులో జమ చేయకుండా దోచుకుందని ఆరోపిస్తున్నారు.

బ్యాంకు అధికారుల పాత్రపై ఆరా

వెలుగు అధికారుల ద్వారా ఈ–ప్రింట్, ఆన్‌లైన్ సర్టిఫికెట్ (ఎంసీపీ), మైక్రో క్రెడిట్ ప్లాన్ తీసుకోకుండానే పెద్ద మొత్తంలో బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేశారు. దీంతో ఈ దందాలో వారి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎటువంటి పొదుపూ జమ చేయకుండా, వ్యాపారాలు లేకుండా, ఆర్థిక స్థోమతను పరిగణనలోకి తీసుకోకుండా, బినామీ పేర్లతో రుణాలు ఎందుకు ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై కూడా ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యాన పోలీసులు విచారణ చేస్తున్నారు.

350 మంది బాధితులు!

ఇటీవల ఆ బ్యాంకు బ్రాంచి మేనేజర్ బదిలీ అయి, కొత్తగా మరో మేనేజర్ వచ్చారు. రుణాల రికవరీలో ఇబ్బందులు రావడంతో ఇంత పెద్ద మొత్తంలో రుణాలు ఎందుకు ఇచ్చారని ఆయన ఆరా తీశారు. దీనిపై వెలుగు అధికారులకు సమాచారం ఇచ్చారు. అసలు ఆ రుణాలకు, తమకు ఎటువంటి సంబంధమూ లేదని అధికారులు చెప్పడంతో ఈ అక్రమ రుణాల దందా వెలుగులోకి వచ్చింది. దీంతో రుణాలు పొందిన మహిళలకు బ్యాంకు అధికారులు నోటీసులు ఇచ్చారు. తీసుకున్నది రూ.50 వేలు అయితే కట్టాల్సింది రూ.2 లక్షలు అని రావడంతో బాధిత మహిళలకు అనుమానం వచ్చింది. అసలు తాము అంత పెద్ద మొత్తంలో రుణాలు తీసుకోలేదని, తమను మోసం చేసిన చిన్ని ఈ రుణాలు తీసుకుందని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు. సుమారు 350 మంది మహిళలు ఇలా మోసపోయినట్లు భావిస్తున్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి మృతి

సామర్లకోట: స్థానిక ఐదు తూముల వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం ఉదయం కాకినాడ రోడ్డు నుంచి ఐదు తూముల వద్ద చేపల మార్కెట్ మీదుగా రైలు పట్టాలు దాటి అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వైపునకు వస్తుండగా విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతున్న సూపర్‌ఫాస్ట్ రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి (70) మృతి చెందాడు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

ప్రత్తిపాడు: ఉత్తరకంచి బ్యాంక్ దోపిడీ కేసులో ప్రత్తిపాడు పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ నెల 7న ఉత్తరకంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దోపిడీ జరగడం, రూ. 1.5 కోట్ల విలువైన బంగారం, నగదు దోచుకుపోయిన సంఘటన తెలిసిందే. ఈ కేసులో మహారాష్ట్ర బుల్‌దానా జిల్లాకు చెందిన హరీష్ మిలాన్ గైక్వాడ్, అక్షయ్ గజానన్ అంబోర్ అను వెస్ట్ బెంగాల్‌లో అరెస్టు చేశారు. నిందితులను పిఠాపురం కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కాకినాడ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ పరిధిలో ఒక ఫార్మసిస్టు, రెండు ఎల్‌సీఎస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్ శనివారం పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకూ కాకినాడ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు డౌన్ లోడ్, విద్యార్హతలు ఇతర వివరాల కోసం ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీఓవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీఓవీ.ఇన్, కోనసీమ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లను సందర్శించాలని వివరించారు.

పుణ్యస్నానం.. కమనీయ ఘట్టం



అంతర్వేదిలో సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు



చక్రస్నానం చేయించేందుకు స్వామిని తోడ్కొని వస్తున్న అర్చకులు

- అంతర్వేది క్షేత్రంలో స్వామివారికి వైభవంగా చక్రస్నానం
- పోటెత్తిన భక్తజనం

సఖినేటిపల్లి: భక్తిభావం ఉప్పొంగింది.. ఆ స్వామివార్లను ప్రత్యక్షంగా తిలకించిన ప్రతీ మది పులకించింది.. అంతర్వేది, ద్రాక్షారామ క్షేత్రాల్లో స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా చక్రస్నానాల ఘట్టం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటింది. అంతర్వేది లక్ష్మీనారసింహుని కల్యాణోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి చక్రస్నానం కన్నుల పండువగా జరిగింది. సుదర్శన చక్రం ధరించిన నృసింహస్వామి (సుదర్శన పెరుమాళ్ స్వామి) జలకమాడిన సముద్రంలోనే అశేష భక్తజనం పుణ్యస్నానం ఆచరించి పులకించింది. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి ఆధ్వర్యంలో పేరూరు ఉద్దండ పండితుడు స్వామివారిని ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకువచ్చి సముద్ర స్నానం చేయించారు. అలాగే సముద్ర తీరంలో నాలుగేళ్లుగా నిలిచిన జల్లు స్నానం ఈ ఏడాది ఆలయ అధికారులు పునరుద్ధరించారు. ఉదయం 8 గంటలకు ఆలయం వద్ద ఉత్సవమూర్తులను గరుడ పుష్పక వాహనంపై, పల్లకిలో సుదర్శన చక్రధారుడైన నృసింహస్వామిని ఊరేగిస్తూ మంగళ వాయిద్యాలతో తీరానికి తోడ్కొని వచ్చారు. అక్కడ దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో నారసింహస్వామికి పంచామృతాలు, కొబ్బరి నీళ్లతో అభిషేకాలు చేశారు. పేరూరు పండితులు సుదర్శన చక్రధారుడైన స్వామిని శిరస్సుపై ధరించి సముద్ర స్నానం చేయించారు.

అంతర్వేదిలో నేడు

అంతర్వేది ఉత్సవాల్లో పదో రోజు ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక చెరువులో హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు ఉత్సవరులకు తిరుమంజనం, దర్పణసేవ, ధూపసేవ, ద్వాదశ తిరువారాధన, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్టి, స్వామివారి పవళింపు సేవ ఉంటుంది.

స్వామితో పాటు భక్తులు, అధికారులు, ప్రముఖులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామిని అర్చకులు ఊరేగింపుగా వసంత మండపానికి తీసుకెళ్లారు. దద్ధోజనం, పానకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పిదప స్వామిని గరుడపుష్పక వాహనంపై ఊరేగిస్తూ ఆలయానికి తీసుకువచ్చారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై రాము, ఎంపీపీ వీరా మల్లిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ఆలయం వెలుపల, ధర్మదర్శనం, శ్రీఘ్రదర్శనం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గంట గంటకూ పెరిగింది. సాయంత్రం వరకూ క్యూలైన్లలో ఉండి భక్తులు శ్రీస్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

భక్తజన సంద్రంగా రత్నగిరి

అన్నవరం: మాఘపౌర్ణిమ సందర్భంగా శనివారం రత్నగిరి భక్తులతో కిక్కిరిసింది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున రత్నగిరిపై, వివిధ ప్రాంతాల్లో అధికంగా వివాహాలు జరిగాయి. నవ దంపతులు, వారి బంధుమిత్రులు సత్యదేవుని దర్శనానికి తరలివచ్చారు. వీరితోపాటు ఇతర భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ ఒక్క రోజే స్వామివారిని 70 వేల మంది దర్శించగా, 7,100 వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.80 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు నాలుగు వేల మంది భక్తులు నిత్యాన్నదాన పథకంలో స్వామివారి ప్రసాదం స్వీకరించారు. సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల మూల విరాట్‌లకు తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం పంచామృతాలతో మహాన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను స్వర్ణ ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం యాగశాలలో ఆయుష్య హోమం జరిపారు. తర్వాత హోమ గుండంలో ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, రమేష్ ఘనాపాఠి, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం తదితరులు ఈ క్రతువులు చేశారు.



ఆయుష్య హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

ఆధునిక టెక్నాలజీతో అభివృద్ధి

గండేపల్లి, జగ్గంపేట: ఆధునిక టెక్నాలజీతో అన్నింటా అభివృద్ధి సాధిస్తున్నామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలో ఏర్పాటు చేసిన వైనాట్ షోరూమ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నరసింహం మాట్లాడుతూ ఇప్పుడు స్మార్ట్ ఫోన్లతో ఎక్కడ ఏం జరుగుతున్నా క్షణాల్లో తెలిసిపోతుందన్నారు. వైనాట్ షోరూమ్ అధినేత జుజ్జవరపు వెంకట రాయుడు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో ఏసీలు, వాషింగ్ మెషీన్లు, సెల్‌ఫోన్లు తమ షోరూమ్‌లలో విక్రయిస్తున్నామన్నారు. ఉభయగోదావరి జిల్లాలో 32 బ్రాంచ్‌లు ఉన్నాయని, వైనాట్ బ్రాంచ్‌లు ప్రారంభించి 30 ఏళ్లు పూర్తి కావొస్తుందన్నారు. యువ నాయకుడు తోట రాంజీ, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పెద్దాడ రాజుబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ గపూర్, జుజ్జవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వైనాట్ షోరూమ్‌లోకి తోట నరసింహాన్ని ఆహ్వానిస్తున్న యాజమాన్యం

సీఎమ్ఆర్‌లో సరికొత్త బంగారు ఆభరణాలు

రాజమహేంద్రవరంలో జ్యూయలరీ షోరూమ్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: అందరూ మెచ్చే ఆధునిక డిజైన్ల బంగారు ఆభరణాల మేళవింపుగా సీఎమ్ఆర్ జ్యూయలర్స్ మొదటి స్థానంలో నిలుస్తుందని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, ప్రముఖ బిల్డర్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం రాజమహేంద్రవరం కోటగుమ్మం కందకం రోడ్‌లో ఏర్పాటు చేసిన సీఎమ్ఆర్ జ్యూయలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ఆయన ప్రారంభించి మొదటి కొనుగోలు చేశారు. సీఎమ్ఆర్ గ్రూప్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అతి పెద్దదైన బంగారు ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ షోరూమ్‌లో నేటితరానికి అనుగుణంగా నూతన డిజైన్లు, సరికొత్త కలెక్షన్లతో జ్యూయలరీ అందుబాటులో ఉందన్నారు. షోరూం ప్రారంభోత్సవ ఆఫర్‌గా గ్రాము బంగారం కొనుగోలుపై రూ.250 వరకూ క్యాష్ బ్యాక్ ఇస్తున్నట్టు ప్రకటించారు. కంటిపూడి స్టీల్స్ మేనేజింగ్ పార్టనర్ కంటిపూడి సర్వారాయుడు పాల్గొని షోరూమ్ మొదటి అంతస్తును, క్లాస్-1 కాంట్రాక్టర్ ఆర్.సుబ్బరాజు రెండో అంతస్తును, కాంట్రాక్టర్ బిల్డర్ డీబీవీ రాజు డిజైన్ రూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్, రాష్ట్ర బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరీ చైర్మన్ చందన నాగేశ్వర్, వ్యాపారవేత్తలు చెరుకూరి వీర్రాజు, అక్కిన ముని కోటేశ్వరరావు, చెరుకూరి కృష్ణాజీ, ఆదర్శ హాస్పిటల్ డాక్టర్ టి.పద్మజ పాల్గొన్నారు.



షోరూం ప్రారంభోత్సవంలో శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం తదితరులు